# 10. అభిప్రాయాలు

సావిట్లో కాలుకాలిన పిల్లివలె పచార్లు చేస్తున్న వీరయ్య "ఇంకా కాలా సర్దుడు?" అని గర్జించాడు.

"ఐపోయింది–" అని అతని భార్య గదిలోంచి జవాబు చెప్పింది.

'వెధవ సర్దుడు! యీ ఆడవాళ్ళు ఎంతకూ తెమిల్చి బైటపడరు' అనుకున్నాడు వీరయ్య.

ఐదారు నిమిషాలు గడిచినా అన్నపూర్ణమ్మ రాలేదు.

"ఏం– గుర్రబ్బండి వొచ్చి చాలా సేపైంది. ఇలాగైతే రైలుకూడా అందదు" అని మళ్ళీ విసుగుతో గొంతు చించుకున్నాడు.

యీసారి జవాబైతే రాలేదుకాని, అన్నపూర్ణమ్మ మాత్రం సకలాభరణాలతోనూ వూడిపడింది. ఆమెను చూసిన వీరయ్య ఒక్కక్షణం దిమ్మెరపొయ్యాడు. అప్పుడప్పుడుగా కొన్న బంగారం కనీసం వందతులాలైనా తన భార్య శరీరాన్ని అలంకరించింది. అన్ని నగలతోనూ తన భార్యను చూడటం అతనికి ఇదే మొదటిసారి... కాని మనుషుల విలువల్ని ఇంతగా పెంచి యీ రోజుల్లో ప్రయాణం చేయడం అంత క్షేమకరం కాదనే విషయం అతనికి మెరిసింది.

"ఎందుకూ ఇప్పుడివన్నీ?" అన్నాడు.

"ఏం... బంధువులందరూ వొస్తారు. పెళ్ళాయె! ఎంతోమంది కొత్తబంధువుల్లో తలవొంపులుగా ఉండదూ?" అందామె.

నిజమే! తన భార్య శరీరంమీదవున్న నగలు, తన ఐశ్వర్యాన్ని చాటుతవి. 'ఫలానా ఆయన భార్య' అంటారు కాని, తనను ఎవ్వరూ 'ఫలానా ఆమె భర్త అనరుకదా!' అందుకని శుభసమయాల్లో స్త్రీలు ఆభరణాల్ని ధరించటం అత్యవసరం- యీ అభిప్రాయంతో వీరయ్య తననుతాను సంబాళించుకున్నాడు.

"సరేకాని- రైలుకు టైం ఐంది" అని ఆమెను తొందరపరిచాడు.

"బండివాణ్ణి ఆ పెట్టె లోపల పెట్టుకోమనండి" అందామె.

జట్కావాడు లోపలికి వెళ్ళి చెమటలు కక్కుతూ తిరిగి వొచ్చి "ఆ పెట్టె నా వొక్కడికీ లేవదండీ!" అన్నాడు.

వీరయ్య విసుక్కుంటూ గదిలోకి వెళ్ళి చూస్తే - అది పెట్టా? చిన్న భోషాణం! దాన్ని చూస్తేనే కూలివాడు కనీసం రూపాయన్నా అడుగుతాడు. అంతడబ్బు ఖర్చుపెట్టేందుకు తన మనస్సు ఒప్పని పక్షంలో, తా నొక్కడూ దాన్ని కదపలేడు కూడాను. సంసారమంతా సర్దకపోతే ఎవడేడిశాడు!

"ఎందుకూ అంత పెద్దపెట్టెకు సర్దావ్?" అన్నాడు కోపంతో.

"ఐదు రోజులూ ఉండాలా? మీ బట్టలూ, నా బట్టలూను- అంతే!" అందామె.

కాదూ కూడదంటే, తిరిగి సర్దేందుకు మరోపూట పడుతుంది. ఒకవేళ పరాయి వూళ్ళో బట్టలు తక్కువైతే చాలా బాధపడాల్సి వొస్తుంది. ఎటుపోయి ఎటువొచ్చినా కాస్త ఎక్కువగానే బట్టలు ఉండటం మంచిది- కనుక ఇంతకన్న పెద్దపెట్టె వేయనందుకు సంతోషించక తప్పలేదు.

జట్కావాడికి సాయంచేసి, ఎలాగో ఆ పెద్దపెట్టెను బండిలో పెట్టగలిగాడు. ఇల్లు తాళంవేసి జీతగాడికి చెప్పవలసినవన్నీ చెప్పి అన్నపూర్ణమ్మ మందగమనంతో బండి దగ్గరకు వొచ్చింది. ఈ ఆలస్యానికి వీరయ్యకు మండిపోతుంది. కాని కనీసం ఏడెనిమిది గంటల ప్రయాణంలో ఇప్పటినుంచే ఆమెతో పోట్లాట వేసుకోవటం అంత మంచిదికాదని ఎలాగో ఓర్చుకున్నాడు.

బండి నడక సాగించింది. ముందు ముందు వేగంగా సాగుతుందనుకునే ప్రయాణం, మందగించింది. రోడ్డులో వున్న గోతులసంగతి ప్రయాణీకులకు అర్థమౌతూనే ఉంది. కాని రైలు తప్పిపోతుందనే ఆదుర్దావున్న వీరయ్యకు ముసలి గుర్రం మీదా, దాన్ని నడిపించే ముసలిసాయిబు మీదా కోపమూ, విసుగూ కలిగినయ్.

"అరేయ్ ఖాసీం! బండికి కట్టింది గుర్రమా? గాడిదరా?" అన్నాడు.

"ఏం చెయ్యమంటారు స్వామి! రోడ్డు బాగాలేదు, పైన ఈ పెట్టె ఒకటి- కాస్త పరుగెత్తిస్తే పెట్టె మీదపడుతోంది" అన్నాడు వాడు.

తప్పంతా తన పెట్టె మీదకూ, రోడ్డుమీదకూ తోసేశాక, వీరయ్య మరి మాట్లాడలేదు. 'లాగేవాడికి తెలుస్తుంది బరువు!' అని సమర్థించుకున్నాడు.

ఇక శరవేగంతో వెళ్ళినా రైలు అందుకునే ఆశ సన్నగిలే ఘట్టం వొచ్చాక, వీరయ్య ఆదుర్దా పూర్తిగా తగ్గిపోయింది. ఈ బండి పోతేపోయె- దీని తరువాతి బండి మరి మూడుగంటలకు కాని రాదాయె! ప్లాటుఫారంమీద యీ భోషాణాన్నీ, భార్యనూ కాపలాకాస్తూ గంటలతరబడి వేచివుండాలి కదా! వెధవ ప్రయాణాలు- అనుకున్న ప్రయాణం అనుకున్నట్లుగా సాగకపోతే ఎంత బాధ! ఈ బండి మెల్లిగా సాగినా బాగుండును... రైలు తప్పనే తప్పిందికదానని, ఇప్పుడే కాస్త వేగాన్ని హెచ్చించింది. వెధవబండి! మనసులో తన ఈ అవస్థకు కారకులైనవారందర్నీ దుమ్మెత్తిపోసుకున్నాడు.

బండి స్టేషన్‌కు జేరగానే లైసెన్స్‌కూలీని పిలిపించాడు. పెట్టెచూడగానే "ట్రాలీ తెమ్మంటారా?" అన్నాడు వాడు.

వీరయ్య గుండెలో రాయిపడింది. దీన్ని ట్రాలీ మీదవేసి ఏ రెండుమూడు రూపాయిలో అడుగుతాడేమో అని భయం వేసింది.

"ఎందుకూ! ఎత్తుకోవచ్చు" అన్నాడు.

పోనీ ప్రయత్నిద్దామని కూలివాడు తలకు యెత్తుకోబోయి ఆగి "లాభంలేదు ఇద్దరమన్నా పట్టాలి. ఏ బండికి బాబూ?... గుంటూరు బండా... ఇప్పు డెక్కడ... సాయంత్రం మూడింటికి... కూలి ఏం దయచేయిస్తారో చెప్పండి" అన్నాడు.

ముందుగానే కూలివిషయంలో తనతో బేరంపెడుతున్నాడని వీరయ్యకు కోపం వచ్చింది. ఏదో కష్టంచేస్తే తను మాత్రం కనిపెట్టియివ్వడూ? వాళ్ళకు ఆ జ్ఞానం లేదాయె... ఐనా ముందుగానే కూలి మాట్లాడుకోవటమే ఉభయులకూ క్షేమకరం. తీరా రైల్లో ఎక్కాక, ప్లాటుఫారం మీద పెద్ద రగడయితే అసహ్యంగా వుంటుంది. ఇదీ ఒకందుకు తనమంచికే అనుకున్నాడు వీరయ్య.

"ఎంత యిమ్మంటావ్?" అన్నాడు వీరయ్య.

"రెండు రూపాయి లిప్పించండి-"

"రెండా? చాలా?" అని కనుబొమలు ముడిచాడు వీరయ్య.

"రూపాయిలని పేరేకాని యేంవొస్తున్నాయ్ బాబూ?" అన్నాడు కూలివాడు. "ఇద్దరమన్నా పట్టందే లేవదాయె. దీన్ని రైల్లోపెట్టాలా?"

కూలివాడితో ఆర్థిక శాస్త్రవాదన వీరయ్యకు యిష్టంలేదు. అసలు పెద్దవాగ్వాదం లేకుండానే సరిపెడదామనుకున్నాడు : కాని ఆ సౌఖ్యానికి చూసుకుంటే జేబు బరువు

తగ్గుతుందనే బాధకూడా వుంది... చావుకుపెడితే లంకణాలకన్నా దిగుతుందనే సిద్ధాంతాన్ననుసరించి "రూపాయి ఇస్తాను–" అన్నాడు వీరయ్య.

"లాభంలేదు... రూపాయిన్నరన్నా యిప్పించండి."

చివరకు రూపాయి పావలాకు బేరం తెగింది. తోడుగా మరొకణ్ణి పిలుచుకొని వొచ్చేందుకు కూలివాడు స్టేషన్‌లోకి పరుగెత్తాడు.

పక్కనే నిలబడ్డ ఖాసీం సాయిబు సంగతి వీరయ్యకు ఇప్పుడే స్ఫురణకు వొచ్చింది. రెండు రూపాయి బిళ్ళలూ తీసి వాడిచేతులో పడేసి, వాడి ముఖకళను పరిశీలించాడు. అసంతృప్తి కరుడుకట్టిన వాడి ముఖం వీరయ్య శరీరంమీద జెర్రుల్ని పాకించింది.

"ఏమిట్రా?" అన్నాడు.

"ఇంకో రూపాయి దయసేయించండి."

"మామూలు ఇచ్చానుగదరా–"

"ఆ మామూలు పోయి రెండేళ్లయిందండీ! గడ్డిమోపు రూపాయి పావలా అమ్ముతోంది. ఏం ఛస్తాం?"

ఖాసీం సాయిబుకూడా ఆర్థిక శాస్త్ర పరిశోధనా ఫలితాల్ని వల్లించ నారంభించాక, వీరయ్యకు మరింత చిరాకు కలిగింది. తెల్లారిలేస్తే మొహాలు చూసుకోవాల్సినవాళ్ళతో పేచీలురావటం, పల్లెటూళ్ళల్లో నివశించేవాళ్ళకు చాలా యిబ్బంది... ఐనా వాళ్ళు మాత్రం యేం చేస్తారు? తనలాటి రైతులు సాధ్యమైనంత యెక్కువధరకే ధాన్యాన్ని అమ్మేందుకు ప్రయత్నిస్తూన్నట్లే, వాళ్లూ ఎక్కువబాడుగ సంపాయించేందుకు ప్రయత్నిస్తూ వుంటారు. తనపట్ల వర్తించే న్యాయమే వాళ్ళపట్లా వర్తిస్తుంది... ఒక రకం సానుభూతి వొచ్చి వీరయ్యను చాలావరకు చల్లబరిచింది. త్యాగబుద్ధితో రూపాయి ఇచ్చి ఖాసీం సాయిబు సలాంను స్వీకరించాడు వీరయ్య.

కూలివాడు తోడు తెచ్చుకున్న మనిషితో ఆ పెట్టెను బ్రిడ్జి దాటించాడు. వాళ్ళ మొహాలమీది చెమట, ఊపిరి పీల్చటంలోని వేగం, మొగంలోని నరాలు బిగుసుకోవటం మొదలైనవి, వాళ్ళుపడ్డ కష్టాన్ని తెలియచెపుతున్నయ్. 'పాపం! ఎంత కష్టపడ్డారో! ఇంతకష్టం వుండబట్టే, కష్టాన్నిబట్టి డబ్బు అడిగారు. వాళ్ళతప్పేం వుంది?' అని సమాధానపరుచుకున్నాడు వీరయ్య.

పెట్టెను నీడలో ఉంచారు కూలీలు. రైలువేళకు వొస్తామని, రొప్పుకుంటూ, చెమట తుడుచుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళారువాళ్ళు. పెట్టెమీద అన్నపూర్ణమ్మ హాయిగా కూర్చుంది.

"మీరు ఇటు కూర్చోండి" అందామె.

ఆమె పక్కనే కూర్చోవటం వీరయ్యకు ఇష్టంలేదు. తన పురుషత్వాన్ని చూపేందుకు అతను ప్లాట్‌ఫారంమీద పచార్లు చేయసాగాడు. రకరకాల జనాన్ని గూర్చీ వివిధాభిప్రాయాల్ని ఏర్పరుచుకుంటున్నాడు. ఎంతకూ తిరగని గడియారాన్ని తిట్టుకుంటున్నాడు. ఇందుకు తోడుగా ఉక్కపోస్తోంది. చెట్లకొమ్మలు ఎక్కడా కదలటంలేదు. ఆరుబయట వున్నా, గాలిఆడని గదిలో బంధించబడినంత బాధగా వుంది...

'వర్షమన్నావొస్తే బాగుండు' అనుకున్నాడు వీరయ్య. వర్షాకాలమన్నమాటే కాని, ఇంతవరకూ సరైనవర్షమే పడలేదు. వర్షంలేందే మంచి పంటారాదు.

ఇంతలో యెగువకు వెళ్ళే బండివొచ్చింది. ఆ బండిలోని జనాన్ని వీరయ్య పరిశీలించి చూడసాగాడు. సెకండుక్లాసులో యిద్దరే యిద్దరు... చోటంతా యేం చేసుకోవాలో తెలియక పడి దొళ్ళుతున్నారు... ఇంటర్ కూడా ఖాళీగానే వుంది... అరె! థర్డ్‌క్లాస్ మరీ ఖాళీగా వుంది! 'దేశంలో డబ్బు తక్కువ కావడం వల్ల ప్రయాణాలుకూడా తగ్గిపోయినయ్' అనుకున్నాడు వీరయ్య.

తన దర్జాకు లోటు లేకుండా వుండేందుకు ఏ క్లాసు కొందామా అని మధనపడుతూన్న వీరయ్యకు ఈ రైలులోని ప్రయాణీకుల్ని చూశాక, తేలిపోయి నట్లయింది. సెకండ్ క్లాసు పరమదండుగ. డబ్బే కాకుండా, తోడు ఎవ్వరూ ఉండరు. తనూ, తన భార్యా బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చెయ్యాలి. ఇంటర్ అసలే కొనకూడదు. అది ఎటూకాని క్లాసు. పోతే ఇంత ఖాళీగావున్న థర్డ్‌క్లాసుకొంటే సరిపోతుంది. తోడుకు తోడూ ఉంటుంది. డబ్బుకుడబ్బూ ఆదా!

ఆ బండి బయలుదేరి వెళ్ళింది. వీరయ్య పెళ్ళాం వున్నవైపు బయలుదేరాడు. అశోకవృక్షంకింద సీతమ్మవారల్లే కూర్చుందామె... కాస్త దూరంలో కూర్చున్న ఇతర ప్రయాణీకులు ఆమెను చూస్తున్నారు. ఆమె నగల్ని చూస్తున్నారో, లేక ఆమె అందాన్ని చూస్తున్నారో వీరయ్యకు మొదట్లో అర్థంకాలేదు. ఆమె పెద్ద అందమైనది కాదు కనుక, ఆభరణాల్నే చూస్తూ వుండొచ్చనుకున్నాడు వీరయ్య– ఏమో! తన కళ్ళకు కనిపించని ఆమె అందం ఇతరుల కళ్ళకు యెందుకు కనిపించకూడదు! ఆ మాటకొస్తే ఆమె కాపరానికివొచ్చిన మొదట్లో 'అప్సరసే' అనుకునేవాడు తను! వయస్సుముదరసాగాక, ఆమెమీద మోజు చాలావరకు తగ్గింది. పోతే తాను పూర్వం ఆమెలో గుర్తించిన సహజ సౌందర్యపు ఛాయలు యిప్పుడూ ఉండొచ్చు, దానికి తోడు సకలాభరణ భూషితయేప్పటికి మరికొంత కొత్త అందం వొచ్చిపడి ఉండొచ్చు!

మొత్తం మీద తన భార్య గొప్పింటిదనే ఉద్దేశంతోనే, ఏదో గొప్పతనాన్ని చూడగలుగుతున్నామనే తృప్తితోనే పదిమందికళ్ళూ ఆమెమీదనే పడినవనేందుకు సందేహం లేదు... నిజంగా ఆడవాళ్ళవల్లనే మొగవాళ్ళ విలువలు పెరుగుతయ్.

ఉదాహరణకు ఆమెను అంత గొప్పగా చూసే యీజనం, తనే ఆమె భర్తని తెలుసుకుంటే అంతకు పూర్వం ఆమెపట్లచూపే గొప్పతనానికి మరికొంత జోడించి తనపట్ల చూపక తప్పదు. యీ ఆలోచనకు వీరయ్య తనలో నవ్వుకొని, మీసం మెలేసి ఆమె పక్కనే కూర్చున్నాడు... మిగతా ప్రయాణీకుల దృష్టి తన మీదనే వాలిందనే పిచ్చినమ్మకం అతనికి ఎంతో తృప్తినిచ్చింది.

కాని చాలా సేపటినుంచీ యీ ప్రయాణీకులు తన భార్యనూ, తననూ తేరిపారచూడటం వీరయ్యకు ఇష్టంలేదు. ఇష్టమేమిటి- వాళ్ళచూపులు శరీరంమీద గొంగళీ పురుగులు పాకుతూన్నంత బాధను కలుగజేస్తున్నాయ్. ఐనా వాళ్ళ గోలేదో వాళ్ళు చూసుకోక ఇతరులను పరిశీలనగా చూడటం ఎందుకో? తామిద్దరూ ఏదో వింత జంతువులన్నంత తీక్షణంగా చూడాల్సిన అవసరం వాళ్ళకేముంది? ఇలాటి అంటువ్యాధి అంటే వీరయ్యకు యీ క్షణంలో అంతులేని ఏవగింపు కలిగింది. అందులోనూ ఆడదాన్ని చూడటం. ఆ ఆడది తన భార్యే కావటం- ఆముదం తాగుతూన్న అవస్థను తెచ్చిపెట్టింది... 'వెధవ లోకం వెధవ మనుషులూనూ' అనుకున్నాడు వీరయ్య.

వాళ్ళకు బుద్ధిలేదు కనుక ఆ ప్రదేశంనుంచి కదిలి వేరొక ప్రదేశానికి వెళ్దామా అనుకున్నాడు వీరయ్య. కాని యీ భోషాణాన్ని కదల్చటం ఎవడితరం? ఆ వేరొక ప్రదేశానికి మాత్రం వీళ్ళురారని ఏమిటి? వీళ్ళు కాకపోయినా వేరొకళ్ళన్నా మూగకపోరు. ఇదేమన్నా తన స్వగృహమా- తన ఇష్టప్రకారమే జరిగేందుకు?

ఐనా వీళ్ళందరికీ భయపడి ఇంకో వైపుకు పోవటమంటే- ఒకవిధంగా తన పిరికితనాన్నీ, తనకు లేని కల్మషాత్మనూ చాటినట్లే అవుతుంది. ఆ 'కల్చర్' యీ జనంలో లేదని తనలోకూడా లేకుండా చేసుకోవటం తన అల్పత్వాన్నీ, మూర్ఖత్వాన్నీ రుజూచేసుకోవటమే అవుతుంది- కనుక తన గొప్పతనాన్ని రుజూచేసుకునేందుకైనా యీ చూపుల దాడిని ఎదుర్కోవటం అత్యుత్తమం. తమకు లేనిదాన్ని- తనదగ్గరా తన భార్యదగ్గరా చూస్తూ లోలోన యీర్ష్యపడి కుళ్లేజనాన్ని చూస్తూంటే నిజంగానే ఎంత తృప్తి కలుగుతోంది! వాళ్ళబాధకు తానే కారకుడు ఐనప్పటికీ వాళ్ళు తనను నేరం పట్టలేరు. పట్టినా తననేమీ చేయలేరు. వాళ్ళ ద్వేషం వాళ్ళనే దగ్ధంచేస్తుంది. ఆ సంగతి తెలుసుకొని అసలు ద్వేషపడకుండానే ఉండటమో, లేక ద్వేషాన్ని రేకెత్తించే దృశ్యంనుంచి విరమించటమో చేయవలసింది వాళ్ళు! వాళ్ళమంచి వాళ్ళకే తెలియదు- అంత విశాలహృదయంకూడానా! 'ఎవరి మూర్ఖత్వానికి వాళ్ళే తగిన జరిమానాల్ని చెల్లించుకోనీ!' అనుకున్నాడు వీరయ్య.

యీ వాతావరణంలో తను భార్య పక్కనే ఉండేందుకు నిశ్చయించుకున్నాడు వీరయ్య. ఇంతకుముందు తనకూ ఆమెకూ సంబంధం లేనట్లు ఫాట్‌ఫారంమీద పచార్లు

సాగించాడు. ఇప్పుడు ఇతరుల ద్వేషాన్ని ప్రజ్వలింపచేసేందుకైనా తను ఆమె కొంగు పట్టుకొని వేళ్ళాడవలసిన అవసరం వుందని గ్రహించాడు. భార్యపట్ల ఇంతకుపూర్వంలేని గౌరవ భావంకూడా వచ్చిపడింది.

"మనం వెళ్ళేప్పటికి రాత్రి తొమ్మిది దాటుతుంది. కాస్త ఫలహారంచేసి కాఫీ తాగుదామా?" అన్నాడు వీరయ్య.

"మీరు ఫలహారం తీసుకోండి... నాకేం అక్కర్లేదు. కాఫీ చాలు" అందామె.

యీ ఆడవాళ్ళకు మొగాళ్ళలాగు పదునైన ఆకళ్ళు ఉండవు- ఎందుకనో? భర్తలు ఇంటికివొచ్చేదాకా, ఎంత ఆలస్యమైనాసరే కనిపెట్టుకొనే వుంటారు కాని భోజనాలు చేయరు. అదే తనైతేనా- ముందు తన భోజనం సంగతి చూసుకునేవాడు! యీ నిరసన వ్రతాలు ఆడవాళ్ళు చేయటం కాదు కాని, చేస్తేనా మొగాళ్ళను తలదన్నేవారు!... 'ఐనా ఆడవాళ్ళకు పెద్దపనేం వుంటుంది కనుక- కరకరా ఆకలేసేందుకు?" అనుకున్నాడు వీరయ్య.

రాత్రి తొమ్మిదింటిదాకా ఆకలి ఆగేట్లుగా టిఫిన్ తీసుకున్నాడు వీరయ్య. భార్యకుమాత్రం కప్పులో కాఫీ తీసుకొచ్చి ఇచ్చాడు... ఇంకా అరగంట ఆగుతేకాని బండి రాదు. ఇందాకటి నిశ్చయంప్రకారం థర్డ్‌క్లాస్ టిక్కెట్లే తీసుకొని బండిరాకకు ఎదురుచూడసాగాడు వీరయ్య!

ఎలాగో అరగంటా గడిచింది. బండి వొచ్చింది. కూలీలు నానాఅవస్థపడి పెట్టెను బండిలో యెక్కించారు. అసలే థర్డ్‌క్లాసు కావటంవల్ల ఆ పెట్టెను యెటువుంచినా కుదరలేదు. నిజానికి తనదగ్గర్నే పెట్టెను ఉంచుకుందా మనుకున్నాడు వీరయ్య. అది వీలవలేదు. చివరకు దారిలో, తలుపు దగ్గర్నే ఉంచాల్సి వొచ్చింది. జనం కిటకిటలాడిపోతున్నారు. ఇద్దరు కుర్రాళ్ళు పెట్టెమీద కూర్చున్నారు. వీరయ్యకు అది ఇష్టంలేదు- కాని పెట్టెను కదిలించనూలేదు కనుక, కిక్కురుమనేందుకు వీల్లేకపోయింది. తనకూ తన భార్యకూ కూర్చునేచోటు దొరికినందుకు సంతోషించక తప్పలేదు.

గాలి స్తంభించింది. రైలు పెట్టెలో ఊపిరి ఆడటం లేదు. రైలు త్వరగా బయలుదేరుతేనన్నా బాగుండును అనుకున్నాడు వీరయ్య. రైలు బయలుదేరగానే 'అమ్మయ్య' అని నిట్టూర్చాడు.

ఒక పక్కనుంచి బిచ్చగాడు అపశృతిలో పాట లంకించుకున్నాడు. ఆ స్థితిలో మధురగానం వినేందుకుకూడా వీరయ్య విసుక్కునేవాడు. కాని యీ పాట మరీ కర్ణకఠోరంగా వుంది. అధికారం తన చేతుల్లోవుంటే వీళ్ళను ఉరి తీయించేవాడు... చీమకదిలే సందన్నాలేని పెట్టెలో బిచ్చగాడు వీరవిహారం ప్రారంభించాడు. ఎవరి కాళ్ళుతొక్కాల్సి వొచ్చినా వాడు సందేహించడు- అలాగే మనుషుల్ని రాచుకుంటూ, కట్టలు తెంచుకున్న నదీ ప్రవాహమల్లే వొచ్చి పడుతున్నాడు.

ఒకళ్ళిద్దరు కాస్లు వేశారు. 'బిచ్చగాళ్ళకు కాదు బుద్ధిలేంది- యీ ధర్మం చేసేవాళ్ళకు' అనుకున్నాడు వీరయ్య. ధర్మం చేసేవాడు లేకుంటే, అడుక్కు తినేవాడూ ఉండడు. ధర్మంచేయటమంటే ప్రయాణీకులు తమకు కలిగే ఇబ్బందిని, బాధనూ కొనుక్కోవటమే అవుతుంది! యీ సూక్ష్మబుద్ధి లేనివాళ్ళవల్లనే దేశంలో అడుక్కుతినేవాళ్ళ సంఖ్య పెరగక తప్పటం లేదు!

ముష్టివాణ్ని వెళ్ళమని ఎవరూ కసరరు. వాకిలిదగ్గర ఉన్నవాళ్ళే దబాయిస్తే సరిపొయ్యేది. తమ ధర్మబుద్ధిని ప్రకటించుకునేందుకు, ముష్టివాడిమీద ఒక రకం సానుభూతిని చూపటం, తాము ధర్మం చేయకపోయినా, చేసే మహారాజును లేదా మహారాణిని చూపటం తమ బాధ్యతే ఐనట్లుగా వాళ్ళను లోపల కూర్చున్న ప్రయాణీకుల మీదికి ప్రోత్సహించారు!

'ఛీ-ఛీ' అనుకున్నాడు వీరయ్య. తనకు అటూ, ఇటూ కూర్చున్నవాళ్లు లంకపొగాకు చుట్టలు వెలిగించి, ఇంజను వొదిలే పొగకు పోటీగా గుప్‌గుప్‌మని పొగ వొదులుతున్నారు. అచ్చంగా బొగ్గుపులుసు గాలినే పీల్చాల్సివొచ్చినందుకు వీరయ్య తలక్కిందులవుతున్నాడు. దీనికితోడు ఉండిఉండి వాళ్ళు కిటికీలోనుంచి తుపుక్కున ఉమ్మేస్తూండటం, ఒకటి రెండు తుంపరలు మీదపడటం మరింత చీకాకుగా వుంది వీరయ్యకు!... ఈ వెధవ థర్డ్‌క్లాస్‌కొని తను గొప్ప పొరపాటు చేశాడు. డబ్బుపోయినా సెకండ్‌క్లాస్ కొనుక్కుంటే హాయిగా ప్రయాణంచేసే పని!

ముష్టివాడు తనదాకా వొచ్చాడు. వాడికి జవాబు చెప్పటంకూడా ఇష్టంలేక వీరయ్య ఊరుకున్నాడు. లోపల పగిలే అగ్నిపర్వతపు జ్వాలల్ని సహిస్తూ తన బాధను తానే అనుభవిస్తూన్న వీరయ్య అవస్థ ముష్టివాడికి అనవసరమనిపించింది. తన విద్యుక్తధర్మం ప్రకారం పాట పాడుతూ తాళంగా చేతిలోని చిల్లర డబ్బుల్ని మోగిస్తున్నాడు... మొండికేసయినా యీ పీడ వొదిలించుకోవాలనే నిశ్చయించుకున్నాడు వీరయ్య... కాని ముష్టివాడు వీరయ్యలాటివాళ్ళను ఎంతమందినో చూసివుంటాడు - దానికి తార్కాణంగా వాడు అంగుళంకూడా కదలకుండా శతమొండి వేషాన్ని వేశాడు...

మరో నిమిషం మార్పులేకుండా గడిచివుంటే, వీరయ్య ముష్టివాడిగొంతు పిసికేసి యీపాటికి శ్రీకృష్ణజన్మస్థానానికి వెళ్ళి ఉండేవాడేమో- కాని, అన్నపూర్ణమ్మ ఒక అణా ధర్మంచేయటంతో ముష్టివాడు వెనక్కు తిరిగాడు. అన్నపూర్ణమ్మకు కృతజ్ఞతా, వీరయ్యకు 'నీ లెక్కేమిటి?' అనే నిర్లక్ష్యపు చూపూ వొదిలి మరీ వెళ్ళాడు ముష్టివాడు!

అన్నపూర్ణమ్మ చేసిన పనికి వీరయ్య మొదట్లో మండిపడ్డాడు. కాని ఆలోచించగా ఒక విధంగా ఆమె మంచిపనే చేసిందనిపించింది వీరయ్యకు. ప్రతి సౌఖ్యాన్నీ మనం డబ్బుకు కొనుక్కున్నట్లే ముష్టివాడు వొదిలిపోవటాన్ని కూడా అణా ఇచ్చి కొనుక్కోవాల్సి వొచ్చింది.

పాపం- వాడుమాత్రం ఎలా బతుకుతాడూ? వొచ్చే రైల్లోనూ, పొయ్యేరైల్లోనూ గమ్యస్థానం లేకుండానే తిరుగుతూ అడుక్కుతింటున్నాడంటే - కేవలం పొట్టపోషించుకునేందుకే కదా! యెవ్వరూ ధర్మం చేయకుంటే వాడు ఆకలికి మాడి చావడూ? తనూ, తనలాటివాళ్ళు కొంతమంది ధర్మం చేయకపోయినా, తన భార్యలాటి ధర్మబుద్ధిగలవాళ్ళు యిచ్చే డబ్బుల్తో వాడు పొట్టపోసుకుంటాడు. తనకు విసుగ్గా వుండబట్టి ముష్టివాడంటే రోతపుట్టింది కాని, యిప్పుడు అటు ఆలోచిస్తే వాడి బతుకుతెరువు కూడా ఒప్పదగిందే అనిపించింది వీరయ్యకు.

స్టేషన్‌లో బండి ఆగి, మళ్ళీ కదిలింది. ఈసారి ఒక గుడ్డిదీ, దాన్ని నడిపిస్తూ చిన్నకుర్రాడూ ఎక్కారు. మళ్ళీ పాట మొదలు. ముష్టిది రూపానికి యెంత కురూపో, అందుకు తగినట్లే పాటకూడా కర్ణకఠోరంగా వుంది.

'ఛీ-ఛీ వెధవదేశం!' అనుకున్నాడు వీరయ్య. తేలిగ్గా ఒళ్ళు అలవకుండా డబ్బు సంపాయించాలంటే అడుక్కుతినటమే మంచిది. అందుకనే ఇంతమంది ముష్టివాళ్ళు!'

-కాని వాళ్ళ తప్పేముందీ? వీళ్ళను రూపుమాపాలంటే ధర్మం చేసేవాళ్ళు ఉన్నంతకాలమే, ధర్మం అడిగేవాళ్ళూ ఉంటారు. ముష్టివాళ్ళమీది కోపం, విసుగు, రోతా- ధర్మం వేసేవాళ్ళమీదికి మళ్ళింది.

ఈ ప్రయాణం యెంతకూ తెమిలేట్లు లేదు... హాయిగా పై తరగతిలో ప్రయాణం చేసినా తీరిపొయ్యేది. ఈరోజు తనకు ప్రతీదీ ప్రతికూలంగానే ఉంది?

బెజవాడ వొచ్చేప్పటికి చీకటిపడింది. బండిలోనుంచి దిగాక, పోయిన ప్రాణం తిరిగివొచ్చినంత హాయిగావుంది వీరయ్యకు. కూలివాళ్ళను పిలిచి పెట్టె ఎత్తుకోమన్నాడు... ఈసారి వాళ్ళు అడిగినంతా పారేసి యెలాగో ఈ ప్రయాణాన్ని పూర్తిచేయాలని నిశ్చయించుకున్నాడు వీరయ్య. కాని కూలివాళ్ళు ఏమీ అడగకుండానే పెట్టె ఎత్తుకున్నారు... 'ఎలాగైనా పట్టణవాసులకు నాగరికత తెలుసు' అనుకున్నాడు వీరయ్య.

తీరా గుంటూరు బండిలో పెట్టె ఎక్కించాక వీరయ్య రూపాయి ఇచ్చాడు. దాంతో ఆరంభమైంది వాగ్వాదం. కూలీలు చేసిన కష్టానికి తగినట్లు యిమ్మని అడిగే ధోరణిలో లేరు. వాళ్ళ తాతగాడి సొమ్మేదో తనదగ్గర దాచిపెట్టినట్లుగా పోట్లాట వేసుకున్నారు. అసలే చిరాకుగావున్న వీరయ్యకు వీళ్ళ దబాయింపుతో కారం రాచుకున్నట్లయింది. వీళ్ళతో పోట్లాడటమే మంచి దనిపించింది.

జనం పోగయ్యారు కాని, ఎవ్వరూ సర్దేందుకు ప్రయత్నించలేదు సరికదా యెంతో సరదాగా వేడుకను చూసినట్లు చూస్తున్నారు. కూలీలు ఇద్దరైపోయి తను వొక్కడే

ఐపోయినందుకు వీరయ్య ఖిన్నుడయ్యాడు. ఏమైనా తన అశక్తతకు చింతించటంకన్న, ముందు కూలివాళ్ళ పీడనూ అంతకన్న ముఖ్యంగా తోడి ప్రయాణీకుల పీడనూ వొదిలించుకోవటం అత్యవసరంగా కనిపించింది వీరయ్యకు. మరో రూపాయి వాళ్ళ మొహానకొట్టి వీరయ్య తీరిగ్గా గాలిపీల్చుకున్నాడు. సూర్యరశ్మికి మంచు కరిగినట్లుగా చుట్టూజేరిన జనం యెవరి దారిన వాళ్ళు వెళ్ళారు.

'అందుకనే పట్టణంలో మోసం యెక్కువంటారు' అనుకున్నాడు వీరయ్య 'మొదట్లో బేరమాడేవాళ్ళే యేనాటికైనా మెరుగు. యీ వెధవలు మొదట్లో యిచ్చే మర్యాదకు కూడా కొంత డబ్బు చెల్లించాలి కాబోలు! వెధవ పట్టణం... వెధవ పద్ధతులూను!'

బండిసాగాక కాని వీరయ్యకు కాస్త రిలీఫ్ కలగలేదు. మరో గంటన్నరకుకాని గమ్యస్థానంజేరదు. ఈ కాస్సేపూ ఎలాగో బిగపట్టుకు కూర్చుంటే తీరిపోతుంది.

జనం కిక్కిరిసి వుండటంవల్ల వీరయ్యకు బాధగానే వుంది. ఇందుకు తోడు వాకిలికి అడ్డంగా పెట్టిన పెట్టెమీద ఒక కన్నువేసి వుండాలి. మరీ ఆ పెట్టెమీద యితరుల సామాన్లు పెట్టటంచూస్తే వీరయ్యకు వొళ్ళుమండిపోతుంది... చేసేదిలేక సహించాడు.

మళ్ళీ ముష్టివాళ్ళూ, బటానీలు అమ్మేవాళ్ళూ, బిస్కట్లు అమ్మేవాళ్ళూ, తామరమందు అమ్మేవాళ్ళూ తయారయ్యారు... వెధవ మూడోతరగతి ప్రయాణం అనిపించింది. డబ్బు ఆదా ఐనా సుఖమేదీ? ఆకలివేస్తోంది. యే బటానీలో కొనుక్కుంటే బాగుండు ననిపించింది వీరయ్యకు. కాని 'నాగరికుడైనవాడు వెధవ బటానీలు కొనుక్కోడు' అని సరిపెట్టుకున్నాడు వీరయ్య.

కాలేజీనుంచి తిరిగి యిళ్ళకు వెళ్ళే విద్యార్థులు బటానీలు కొనుక్కొని తినటంచూశాక– నాగరికత మారిందేమో ననుకోక తప్పలేదు. పెద్ద చదువులు చదివే యీ భావిభారత పౌరులే బటానీలు తినగాలేంది, ఘోర్తుఘారం ఆనర్సయిన తను తినేందుకేం? వెంటనే బేడ బటానీలు కొన్నాడు వీరయ్య. భార్యవైపు చాపాడు చేతులోని పొట్లాన్ని, కాని ఆమె అక్కర్లేదన్నది. 'అంతా బెట్టు' అనుకున్నాడు వీరయ్య. "కాకపోతే ఆకలివేస్తుంటే బటానీలు కొనుక్కుతినటం నేరమా?... దూరం ఆలోచిస్తే, తినకపోవటమే నాగరికత అవదు."

మబ్బులతో బరువెక్కిన ఆకాశం, వర్షాన్ని విడుదలచేసి తన భారాన్ని తగ్గించుకోసాగింది. ప్రాణానికి హాయిగావుంది. కాని వర్షపు నీరు పెట్టెలోకి రాకుండా వుండేందుకు కిటికీలన్నీ వేసుకోవాల్సి వొచ్చింది. పొగతాగేవాళ్ళు కాస్త అధికంగానే ఉండటంవల్ల, పొగబైటికి పోకుండా వుంది. వీరయ్యకు వూపిరి ఆడనంత బాధ కలిగింది... యెవరి మీద అలిగి యేంలాభం? అలాగే భరించాడు.

త్వరలోనే తగ్గుతుందిలెమ్మనుకున్న వాన క్షణక్షణానికీ అధికం కాసాగింది. ఆకాశం చిల్లులుపడ్డట్లు ఒకే ధార! తను దిగవలసిన స్టేషన్ సమీపిస్తున్నకొద్దీ వీరయ్య గుండెల్లో రైళ్ళు పరుగెత్త సాగినయ్...

తను దిగేదా చిన్న స్టేషన్. అందులోనూ రాత్రి తొమ్మిదిగంటల సమయం. ఒకపక్క జోరున వర్షం. ఆ స్టేషన్‌లోనా కూలీలు దొరకరు. రైలు యెక్కువసేపు ఆగదు. యీ బుల్లిభోషాణ్ణాన్ని దింపటమెలా? దింపినా, అక్కడికి రెండుమైళ్ళున్న వూళ్ళోకి వెళ్ళటం యెలా? అంతా తన చావుకే వొచ్చినట్లు తోచింది- వీరయ్యకు.

దిగాల్సిన స్టేషన్‌లో బండి ఆగగానే వీరయ్య కూలీల కోసం వెతకలేదు. ఒక్కడే యెలాగో పెట్టెను ప్లాట్‌ఫారం మీదికి దొర్లించాడు. తడవకుండా భార్యవెళ్ళి స్టేషన్ షెడ్‌లో కూర్చుంది. తనుమాత్రం తడుస్తూ ఆ పెట్టెవైపు జాలిగా చూస్తూ ఉండిపొయ్యాడు. పెళ్ళాం సుఖంగా వుండటం చూసి 'అందుకనే ఆడజన్మే మధురం! అన్నారు' అనుకున్నాడు వీరయ్య.

ఈ ఆలోచనలు తీరిగ్గా చూసుకోవచ్చు. ముందు ఈ ధారాపాతంలోంచి తనూ, తన భోషాణ్ణమూ బైటపడటం యెలా? ప్రయాణాల్లో సామానూ, ఆడవాళ్ళూ రెండూ పెద్ద న్యూసెన్సే! పిల్లలు లేకపోవటం ఒక్కటే కాస్తగుడ్డిలో మెల్లగా కనిపించింది వీరయ్యకు.

ఆ బండిలో దిగిన పదిపన్నెండుమంది ప్రయాణీకులూ అప్పుడే మాయమయ్యారు. స్టేషన్‌లోవున్న మూడులైట్లలో రెండు అప్పుడే ఆర్పివేయబడినయ్. కూలీలు యెవ్వరూ రాలేదు. స్టేషన్‌మాష్టరు, బుకింగ్ ఆఫీసుకు తాళంవేసే ప్రయత్నంలో ఉన్నాడు...

తన నిస్సహాయ స్థితికి వీరయ్య చాలా బాధపడ్డాడు. తను తప్ప తనకు జాలిచూపేవాళ్ళే ప్రస్తుతం కనుచూపుమేరలో ఉన్నట్లు లేరు. తడిసిముద్దయిన వీరయ్య శిలాప్రతిమలాగు పెట్టెదగ్గరే నిలబడిపొయ్యాడు.

ఐదు నిమిషాలు గడిచేప్పటికి స్టేషన్‌మాష్టర్ గొడుగు వేసుకొని వొచ్చాడు. వీరయ్యదగ్గరి టిక్కెట్లను వసూలుచేసుకుంటూ "ఎక్కడికి వెళ్ళాలి" అని అడిగాడు. ఈ ఆపద్బాంధవుణ్ణి చూసేప్పటికి వీరయ్యకు మళ్ళీ ప్రాణ వొచ్చింది.

చెప్పాడు వీరయ్య-

"ఓ! నేనూ మీవాళ్ళ ఇంట్లోనే ఒకభాగంలో ఉంటున్నా... ఎందుకు తడుస్తూ ఇక్కడే ఉండిపొయ్యారు-?"

వీరయ్య జవాబుగా బుల్లిభోషాణ్ణంవైపు నిప్పులు కక్కుతూ చూశాడు.

"తోడుపడతాను పట్టండి" అన్నాడు స్టేషన్ మాష్టరు.

తనలాటివాళ్ళు యిద్దరుపడితేనే అంతంతమాత్రం... 'ఈ నాగరికుడివల్లేం అవుతుంది?' అనుకున్నాడు వీరయ్య. ఐనా ఇప్పుడు అంతకన్న గత్యంతరంలేదు. తననూ తన పెట్టెనూ స్టేషన్‌మాష్టర్ మనసులో శాపనార్థాలు పెట్టుకున్నా, యేదోరకంగా పనయితే అదే పదివేలు!

నానాఅవస్థాపడి పెట్టెను షెడ్‌లోకి జేర్చారు. తరువాతి కార్యక్రమం పెద్దసమస్య అయింది.

"బళ్ళుకూడా ఏమీలేవు... దారంతా బురదమయం" అన్నాడు స్టేషన్‌మాష్టరు.

ముందుకు సాగినకొద్దీ కష్టపరంపర ఎక్కువ అవుతోంది... 'ఎందుకొచ్చిన ప్రయాణాలురా భగవాన్!' అనుకున్నాడు వీరయ్య. తన భార్యా, ఈ పెట్టె లేకుంటే ఈపాటికి తను పెళ్ళివారింట్లో విందారగిస్తూ ఉండేవాడు!

పాపం- స్టేషన్ మాష్టర్‌కూడా ఎలాగా అని ఆలోచిస్తున్నాడు. ఈ అర్ధరాత్రి ఈ వానలో తన అవస్థలకు సానుభూతిచూపే వ్యక్తి దొరికినందుకు వీరయ్యకు కొంత ఊరడింపు కలిగింది... కాని విసుగెత్తి ఈ వ్యక్తి జారిపోకుండా చూసుకోవాలి. వరదలో కొట్టుకుపొయ్యేవాడికి దొరికే ఆధారం యెంత విలువైనదో వీరయ్యకు తెలియకపోతేగా!

అందుకని కాస్త లోకాభిరామాయణం ప్రారంభించాడు... వానకుతోడు గాలికూడా ఆరంభమవటంతో వీరయ్య ధైర్యం సన్నగిలసాగింది. లోకాభిరామాయణం మీద మాష్టరుగారికి అంత మక్కువ వున్నట్లు తోచలేదు. ఆయన యీ వీరయ్యనూ, ఆయన భార్యనూ, పెట్టెనూ బయటికి పంపటం యెలాగా అనే ఆలోచనలోనే ఉన్నాడు-

"ఒకపని చేస్తే?" అన్నాడు మాష్టరు, "యీ పెట్టె ఇక్కడే వుంచేసి, మీరిద్దరూ నడిచివెళ్తే?"

యీ సలహా అంతగా రుచించలేదు వీరయ్యకు. స్టేషన్ మాస్టరు తనకు అపరిచితుడు. అలాటివాడిదగ్గిర విలువైన బట్టలున్న పెట్టెను వొదలటం మంచిదికాదు! ఏమో- మనుషులు పైకి మధురంగా కనిపించినా లోతుల్లోకాని మురుగు బైటపడదు! అందులోనూ తన గ్రహాలు ఇవాళ బొత్తిగా బాగాలేవు. అలాటప్పుడు ఏ సందర్భంలోనూ ఈ పెట్టెను వొదలటం కుదరదు. అదీగాక పెట్టెలో బట్టలు ఉన్నయ్. యీ తడిగుడ్డలు విడిచేస్తే మరి గుడ్డలెట్లా?

యీ సలహావొద్దని చాలా సున్నితంగా చెప్పాలి. తనను అనుమానిస్తున్నట్లు మాస్టర్‌కు అంతుపట్టకూడదు.

"పెట్టెలో మా బట్టలున్నయ్-" అన్నాడు వీరయ్య, మిగతాది మాస్టరు ఆలోచనలకు వొదిలి.

ఎవ్వరూ మాట్లాడకుండానే మరో పదినిమిషాలు గడిచినయ్. ఎవరెంత తీవ్రంగా ఆలోచించినా ఒక వొడ్డు దొరకటం లేదు.

"దారి అంత మంచిదికాదు... పైగా గాఢాంధకారం... తాటితోపుల్లో దొంగల భయంకూడా వుంది" అన్నాడు మాస్టరు.

కాస్తో కూస్తో ధైర్యాన్ని పట్టుకొని వేళ్లాడుతూన్న వీరయ్య కిందపడక తప్పలేదు... దొంగలు! తాటితోపు! గాలివాన! ఒంటరిగాడైన తనను ఏమైనా చేయవచ్చు! తనభార్య సంగతి ఆలోచించనక్కర్లేదు! ఆమె శరీరం మీది నగలే దొంగలకు పెద్ద ఎర!

'ఛీ – యీ ఆడవాళ్ళు! వాళ్ళ ప్రాణానికి తెచ్చుకొని, భర్తల ప్రాణాలక్కూడా మోసం తెస్తారు!' అనుకున్నాడు వీరయ్య. మొదటినుంచీ ఈ నగల్నీ, ఈ పెట్టెనూ తిట్టుకుంటూనే వున్నాడు... ఇప్పుడు ఆ రెండే తన మృత్యువుకు అడ్డతోవలల్లే కనిపించినయ్.

కాని మందు చేదుగా వున్నదని తాగటం మానేస్తే వ్యాధి కుదరదనే సూత్రం ప్రకారం, ఏది ఏమైనా తాము ఈరాత్రి నిర్మానుష్యమైన ఈ అడవిలోని సేష్టన్ షెడ్‌లో గడపడం అసంభవం– కనుక పెళ్ళివారింటికి వెళ్ళితీరాల్సిందే!

ఒకవిధంగా ఆలోచిస్తే పెళ్ళాం శరీరంమీది నగల్ని కూడా పెట్టెలోనేపెట్టి, పెట్టె మాస్టర్ గదిలోవుంచి నడిచి వెళ్ళటం మంచిదనిపించింది. కాని విలువైన గుడ్డల్తో పాటు అతివిలువైన నగలుకూడా కలిసి మాస్టర్‌గారి బుద్ధిని ఎటులాగినా లాగవొచ్చు. అదీగాక ఇందాక కాదని, ఇప్పుడు ఔనంటే ఆయన ముందు తనను అనుమానించినట్లు తప్పక వాసనపడతాడు. కనుక యీ పద్ధతి అసలు లాభంలేదని తేల్చుకున్నాడు వీరయ్య.

అదృష్టవశాత్తూ తాటితోపులోంచి మెరుపుల కాంతితో ఒక ఒంటెద్దుబండి రాసాగింది. అదొక్కటే ఆశాజనకంగా తోచింది వీరయ్యకు.

స్టేషన్‌మాష్టర్ గారి ముఖంలోకూడా ఆశారేఖ పొడసూపింది.

"అది ఇక్కడి బండే... ఎలాగైనా నచ్చచెప్పి కట్టిద్దాం" అన్నాడు మాష్టరు.

బండివాడికి చాలాదూరం చెప్పవలసి వొచ్చింది. ఐదు రూపాయలకు ఏమాత్రం తక్కువైనా బండి కట్టనన్నాడు. వీరయ్యకు యింత డబ్బివ్వటం నిజంగానే ఇష్టంలేదు. అందులోనూ యితరులు కష్టదశలో వున్నప్పుడు, ఆ కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాపారం చేసేవాళ్ళను చూస్తే అతనికి మంట! కాని తన మంటకు తానే దహించుకొనిపోవాలి! యింతకుముందు బండివాడికి నచ్చచెప్పిన మాష్టర్‌కు యిప్పుడు వీరయ్యకు నచ్చచెప్పవలసిన అవసరం యేర్పడింది.

"నీకు బాగానే యిస్తార్లే" అన్నాడు మాష్టరు. అలా అనకుండావుంటే ఈ బండివాడు కొమ్మెక్కి కూర్చునేవాడా? అనుకున్నాడు వీరయ్య. అందరూ కలిసి తన పతనానికి

యేర్పాట్లుచేస్తున్నట్లే తోచింది వీరయ్యకు. అనవసరంగా తగిలించుకున్న ఈ పీడను వొదిలించుకునేందుకు మాష్టర్ గింజుకుంటున్నాడు.

బండివాడు తొందరపడటంతో వీరయ్యకు వేడెక్కింది. ఇంకాస్త ఆలస్యమైతే బండివాడు మరో రూపాయి పెంచినా పెంచవొచ్చనే అనుమానం తగిలింది. గొణుక్కుంటూనే వొప్పుకోక తప్పిందికాదు.

బండివాడూ, తనూ, మాష్టరూ కలిసి పెట్టెను బండిలోకి యెక్కించారు. పెట్టెబరువుకే యెద్దు మూడొంతులు ముందుకు వొంగింది... ఈ బురదలో యిదేం లాగుతుంది? మధ్యదారిలో పడుకున్నదంటే...?... ఆ తరువాతి దృశ్యం భయానకం! కింద బురద... పైన ధారాపాతం! చుట్టూ చీకటి... తాటితోపులో దొంగలు!... నరకమంటే వేరెక్కడ వుండగలదు కనుక!

ఏమైనా కానీ ప్రయాణం సాగవలసిందే! కళ్ళు మూసుకొని ఆముదం తాగినట్లు, ఆ బాధలు పడబొయ్యేది తను కాదనుకుంటూనే గమ్యస్థానం జేరాలి!

భార్యను మాత్రం బండిలో యెక్కించాడు. స్టేషన్ మాష్టరు సాగనంపేందుకువొచ్చి "బ్యాటరీలైటు తీసుకొని వెళ్ళండి" అని లైటు యిచ్చాడు. వీరయ్యకు ఈ క్షణంలో మాష్టరు దేవుడే అనిపించాడు. నిజంగా యీ మాష్టరే లేకుంటే తన అవస్థ కుక్కలకూ నక్కలకూ యెరుక! గొడుగుకూడా యిస్తే బాగుండుననిపించింది వీరయ్యకు... కాని మనుషుల మంచితనం వాళ్ళకే అపకారం జరిగేవరకూ పెంపొందించుకోవటం మౌఢ్యమే అవుతుందని వీరయ్యకు తెలియకపోలేదు.

బండివాడు నానా అవస్థపడుతూసాగాడు. వీరయ్య తడుస్తూనే బండి వెనుక నడవసాగాడు... బండి తాటితోపులో ప్రవేశించింది. ఏం బురద! బురదలో యిరుక్కున్న కాళ్ళను లాక్కునేప్పటికే వీరయ్యకు కష్టమనిపిస్తోంది; అట్లాంటిది బండినీ, బుల్లిభోషాణ్ణాన్ని, తన భార్యనూ, తన బరువునూ లాక్కోవాల్సిన యెద్దు అవస్థ అర్థమవకపోలేదు. ఇంత బాధవుంది కనుకనే ఐదు రూపాయిల బాడుగ అడిగాడు బండివాడు. బండివాడిలో న్యాయం వున్నదనిపించింది వీరయ్యకు.

ఈ తాటితోపులోనే దొంగల భయం! యెటు కాస్త గాలివేసినా దొంగలు వొచ్చి మీదపడుతూన్నట్లే అనిపించింది వీరయ్యకు. నిజంగానే దొంగలభయం వున్నప్పటికీ, ఆ సంగతి మాష్టర్ చెప్పకుండావుంటే తనలో యీ భయం వుండేదికాదు. ఇప్పుడు భయానికి భయమూ, దొంగల బాధకూడా తప్పేట్లులేవు!

ఐనా ఈ వానలో, ఈ బురదలో దొంగలేం వొస్తారు? హాయిగా ఆవకాయ వేసుకొని తిని, వెచ్చగా ఇంట్లో పడుకుంటారు కాని– తనలాగే నానా అవస్థపడుతూ, ఏమైనా దొరుకుతుందో, దొరకదోకూడా అనుమానమే ఐనప్పుడు– వాళ్ళు వొస్తారా?...

ఏమో– వాళ్ళకు హాయిగా గడుస్తూంటే రారు కాని, ఇంట్లో ఆవకాయా లేక, వెచ్చదనమూ లేక, చివరకు బహుశా అన్నంకూడా లేనప్పుడు రాకతప్పదు!... అందులోనూ ప్రస్తుత వాతావరణం వాళ్ళకు ఎంతో అనుకూలమైనది! ఒకవేళ ఏమీ దొరక్కపోయినా పెట్టుబడికి నష్టపోవాల్సిం దేముంటుంది కనుక?

ఈ బండి త్వరగాసాగితే బాగుండును! మరో అరమైలు వెళ్తేకాని ఇళ్లు తగలవు. అప్పటికికాని అపాయం అంతమైందనుకునేందుకు వీల్లేదు.

వీరయ్య అన్నివైపులకూ బ్యాటరీలైట్లు వేసి తనకోసం దాక్కున్న దొంగలు ఎక్కడవున్నారా అని పరిశీలిస్తున్నాడు. ఇలా లైటువేయటం ఒకరకంగా వాళ్ళను ఆహ్వానించటమే అవుతుందేమోననే అనుమానం కూడా తగిలిందతనికి... కాని లైటు వేయకుండా ఉండలేని అశక్తతకు లోనయ్యాడు.

ఇంతకూ దొంగలు వొస్తారో లేదో తెలియలేదు. ఈ సమస్య అటు దొంగలకు ఎంత కఠినంగావుందో, తనకూ అంత కఠినంగానే వుంది. తనను యీ త్రిశంకుస్వర్గంలో– కాదు, నరకంలో వొదలటంకన్న రాదల్చుకున్నవాళ్ళు వొచ్చినా బాగుండు– ఎటో అటు తేలితే పీడ విరగడవుతుంది!

బండి బురదలో ఇరుక్కుంది. ఎద్దును యెంతకొట్టినా కదలటంలేదు. బండివాడు ఒక చక్రాన్ని పట్టాడు... వీరయ్య వెనుక నుంచి నెడుతున్నాడు. ఐనా లాభం లేకపోయింది... వీరయ్య రెండోచక్రాన్ని పట్టాడు. నానాఅవస్థపడి బండిని కదిలించాడు.

ఇకముందు బురదలోకి పోకుండా ఉండేందుకు వీరయ్య లైటువేసి, బండివాడికి దారిచూపసాగాడు. చీమ నడకతో బండి కదులుతూవుంది– 'వెధవబళ్ళూ, వెధవ ఎద్దులూను!' అని తిట్టుకున్నాడు వీరయ్య... కాని సంపాదనకు తగినట్లే యెద్దులూ బళ్లూను – అని సమాధానపరుచుకోక తప్పలేదు.

గండంగడిచి పిండం బైటపడ్డట్లు బండి రోడ్డుమీదికి వొచ్చింది. గ్రామంలోని ఇళ్ళు ఆరంభమయ్యాయి... ఇంక దొంగలు మరిరారని ఖచ్చితంగా తేలిపోయింది వీరయ్యకు. ఎంత అపాయాన్ని దాటగలిగాడు తను!

ఈ దొంగలభయం కల్పితమేమో అనిపించింది వీరయ్యకు. అలా అంటేనేకాని ఆ చేసే సహాయనికి విలువ హెచ్చదు! నిజంగానే దొంగలు వొచ్చినట్లయితే స్టేషన్ మాష్టర్ మాటలో నిజాయితి పెరిగి వుండేది! దొంగలు రానందువల్ల తనకు కలిగిన లాభంకన్న, వొచ్చినందువల్ల కలగని డిసప్పాయింట్‌మెంటే యెక్కువనిపించింది వీరయ్యకు–

ఇల్లుచేరాక బండివాడికి ఐదురూపాయిలూ చెల్లించుకున్నాడు వీరయ్య. తడిగుడ్డలు పిండుకుంటూ అన్నగారి కొడుకుతో స్టేషన్ మాష్టర్ని గూర్చిన ప్రస్తావన తెచ్చాడు.

"చాలామంచివాడు లాగున్నాడు. చాలా సహాయం చేసాడు" అన్నాడు వీరయ్య.

"మంచివాడే" అన్నాడు అన్నగారి కొడుకు.

"మామూలుగా బండి కిరాయి ఎంత?"

"పావలా!"

"పావలాయా? నా చేత ఐదురూపాయి లిప్పించాడు... ఎక్కడి పావలా? ఎక్కడి ఐదు రూపాయిలు!"

అన్నగారికొడుకు తన పాటకు తాళం వేస్తాడనుకున్నాడు వీరయ్య. కాని అతనేమీ మాట్లాడలేదు.

"అసలు ఈ స్టేషన్‌మాష్టర్లకూ, బళ్ళవాళ్ళకూ స్నేహం! అందుకనే అంత ఇప్పించాడు! ఈ అధర్మ వ్యాపారాల్లో అంతా భాగస్వాములే!"

అన్నకొడుకు వింటున్నాడు.

"ఒట్టి విషపు మనస్సులాగుందే- ఈ మాష్టర్‌ది? వెధవ!" అన్నాడు వీరయ్య.

ఈ ధోరణి అన్నకొడుక్కు నచ్చక మెల్లిగా అక్కణ్ణుంచి తప్పుకున్నాడు.

"అందరూ అందరే - వెధవ జనం!" అని కాస్త గట్టిగానే గొణుక్కున్నాడు వీరయ్య. ఈ రిమార్కులు వినేందుకు ఎవ్వరూ లేనందున వీరయ్యకు కష్టమనిపించింది. అంతకన్న ఆకల్ని భరించటం మరింత కష్టమనిపించింది, వంట ఇంటివైపు సాగాడు వీరయ్య!

- నవంబరు *1953*